క్లుప్తంగా

పాత విధానాలను అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఎఫ్‌ఏ–3 మార్కులు ఆన్‌లైన్ నమోదుకు పాత విధానంలోనే చేసే లాగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్‌టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మౌలాలి, అజాంబేగ్ మాట్లాడుతూ పాఠశాలల వద్ద నెట్‌వర్క్ సమస్యలు వేధిస్తున్నాయని చెప్పారు. విద్యాశాఖ అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనివాసరావు, నాయక్, దేవేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాసరెడ్డి, సంగయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

సేవా పురస్కారాలకు 132 మంది ఎంపిక

ఉయ్యాలవాడ : మండలంలో వలంటీర్ల సేవా పురస్కారాలకు 132 మంది ఎంపికయ్యారని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వజ్ర 2, రత్న 5, 125 మంది వలంటీర్లు సేవా మిత్రలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి వలంటీర్ల అభినందన వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి అన్నదానం

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులో వెలసిన మూలమఠం భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో నేటి నుంచి మార్చి 9వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అన్నదాన కమిటీ సభ్యులు సన్నల వెంకటరెడ్డి గురువారం తెలిపారు. రథసప్తమిని పురస్కరించుకొని శుక్రవారం నుంచి శివ, అయ్యప్ప, గోవింద మాలాధారులతో పాటు బాటసారులకు కూడా అన్న వితరణ కార్యక్రమం చేపడతామని చెప్పారు.

అలరించిన శ్రీమత్ భాగవత మహత్యం



భాగవతాన్ని వివరిస్తున్న హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి, శ్రీశైల దేవస్థానాల వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు శ్రీమత్ భాగవత మహత్యం గురించి భక్తులకు గురువారం వివరించారు. భాగవతంలో శ్రీకృష్ణుడి లీలలు, చిలిపి చేష్టలను కథలు, శ్లోకాల రూపంలో వినిపించారు. దీంతో శ్రీమత్ భాగవత మహత్య ప్రచారాలు ముగిశాయి. దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి, ఈఓ నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నంద్యాల(అర్బన్): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ నంద్యాల తాలూకా అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి కోరారు. ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తాత్కాలిక భృతి 30 శాతం ఇవ్వాలని, పీఆర్సీ కమిషన్ త్వరగా రిపోర్టు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ కార్యదర్శి హుసేన్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, సుబ్బరాయుడు, నర్సారెడ్డి, నాగరాజు, గోవిందు, ఎల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

జల్‌జీవన్ మిషన్‌తో నీటి సమస్యకు పరిష్కారం

వెలుగోడు: గ్రామాల్లో మంచినీటి సమస్యలకు జల జీవన్ పథకం ద్వారా పరిష్కారం చూపుదామని ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్య ఎక్కడైనా ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలన్నారు. జల జీవన్ పథకం కింద నిధులు విడుదల చేస్తామన్నారు. ఇందు కోసం సర్పంచ్‌తో కలిసి 9 మంది గ్రామస్తులతో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కీరయ్య, ఏపీఎం సుగుణపాల్, పంచాయతీ సెక్రటరీలు సుంకన్న, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జోడెద్దుల్లా అభివృద్ధి, సంక్షేమం


బోయలకుంట్లలో గోదాము శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులా సాగుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. గురువారం బోయలకుంట్ల గ్రామ సర్పంచ్ జింకల నాగన్న ఆధ్వర్యంలో రూ. 44 లక్షలతో నిర్మించిన రైతు భరోసా గోదాము, రూ.25 లక్షలతో పూర్తి చేసిన రామేశ్వరస్వామి ఆలయ మండపం, రూ. 25 లక్షలతో వేసిన 6 సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అలాగే గుండంపాడులో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 20 లక్షలు గడప గడప నిధులతో వేసిన 6 సిమెంట్ రోడ్లు, వనికినిదిన్నెలో రూ.15 లక్షలతో వేసిన 2 సిమెంట్ రోడ్లు, గుంప్రమాన్‌దిన్నెలో రూ.20 లక్షలతో వేసిన 3 సిమెంట్ రోడ్లు, రాజనగరంలో రూ.4 లక్షలతో వేసిన మెటల్ రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని విమర్శించే టీడీపీ నాయకులు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించి, ప్రజలను అడిగి తెలుసుకుంటే తెలుస్తుందన్నారు.ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున గడప గడప నిధులతో సిమెంట్ రోడ్లు వాడవాడలా నిర్మించామన్నారు. సర్పంచులు తలారి జానకమ్మ, తలారి రామలక్ష్మమ్మ, దేవస్థానం చైర్మన్ నారాయణ, సొసైటీ చైర్మన్ జింకల శివలింగం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి, కో–ఆప్షన్ మెంబర్ బీరవోలు, జైలానిబాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఇందూరి ప్రతాపరెడ్డి, నాయకులు, ఉశేనిరెడ్డి, నరసింహారెడ్డి, మయ్యన్న, రాజారెడ్డి, రాంపుల్లయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

గుండంపాడులో గురువారం పలువురు టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే గంగుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ మాజీ సర్పంచు గాలి ప్రకాశం ఆధ్వర్యంలో 34 కుటుంబాలు గాలి పెద్ది బుజ్జి, లక్ష్మయ్య, బాలేసు, రాయప్ప, పుల్లయ్య, చిన్నప్ప, బాలస్వామి, బాల సుందరం, శేఖర్, రాజు, నరసింహుడు, సన్న, బాలయ్య, ఆంజనేయులు, కేశాలు, లక్ష్మీదేవీ తదితరులు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండవా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే బీసీ వర్గానికి చెందిన కురువ బాలకృష్ణ, నాగశేఖర్, నందీశ్వరరెడ్డి, పాములేటి, చిన్న నందీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మరో టీడీపీ వర్గానికి చెందిన 26 కుటుంబాలు కూడా వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రేవనూరు ఆంజనేయరెడ్డి, నాయకులు యోగేశ్వరరెడ్డి, ప్రతాపరెడ్డి, దేవస్థానం చైర్మన్ శివశంకరరెడ్డి, దస్తగిరిరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.


గుండంపాడులో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ వర్గీయులు

ఓటరు నమోదుకు 438 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : మండలంలో 18 సంవత్సరాలు పూర్తయిన యువతీ, యువకుల నుంచి ఓటరు నమోదు కోసం 438 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులో ఫారం –6, 7,8 నమోదు, పేరు మార్పులు తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ ఉన్నారు.

నిబంధనల మేరకు పని చేయాలి

గోస్పాడు: సచివాలయ సిబ్బంది ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాలని ఎంపీడీఓ అనసూయ తెలిపారు. మండలంలోని జూలేపల్లె, ఎం.కృష్ణాపురం సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును తప్పని సరిగా నిర్ణీత సమయానికి వేయాలని సూచించారు. సిబ్బంది ప్రభుత్వం సూచించిన డ్రస్ కోడ్‌ను తప్పని సరిగా అనుసరించాలని చెప్పారు. పీఎంజేఏవై కార్డులను లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్, బషీద్, ఆషిఫ్ నాయక్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన కరీముల్లా, సద్దాం, అహమ్మద్, రఫీ, ముజల్, నాయమత్, అలీ,హుసేన్, ఫజల్, సోహెల్, ఆసిఫ్, వసీం, ఫారహాన్, సమీర్, షఫీ,రఫీ,ఫిరోజ్‌తో పాటు 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శిల్పా రవి కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

- రాప్తాడు సభ దద్దరిల్లిపోయేలా తరలిరండి
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పీపీ నాగిరెడ్డి

నంద్యాల: ఈనెల 18వ తేదీన రాప్తాడులోని ఆటోనగర్ వద్ద జరగనున్న 'సిద్ధం' సభకు వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పట్టణంలోని ప్రథమనంది వైఎస్సార్ కల్యాణ మండపంలో సిద్ధం మహాసభ విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందుకు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ దద్దరిల్లిపోయేలా తరలిరావాలని కోరారు. సభకు హాజరైన జనాన్ని చూసి చంద్రబాబు వెన్నుల్లో వణుకు పుట్టాలన్నారు. టీడీపీ హయాంలో హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న రాయలసీమను అభివృద్ధి కేంద్రంగా మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. 124 సార్లు కంప్యూటర్ బటన్ నొక్కి నిరుపేదలను ఆదుకున్న ఘనత జగనన్నదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి సంక్షేమ సారథికి అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు రాప్తాడు ఆటోనగర్ సమీపంలో సభ నిర్వహిస్తున్నారని చెప్పారు. పారదర్శక పాలనతో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించి మేలు చేస్తున్న జగనన్నను నేరుగా ఎదుర్కోలేక టీడీపీ, జనసేన కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని, ఇందుకు పచ్చమీడియా సహకరిస్తున్నాయని మండిపడ్డారు. పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ పింఛన్ తీసుకుంటున్న అవ్వాతాతలు, పథకాలతో లబ్ధిపొందిన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలుస్తామని చెబుతున్నారని, వారి ఆశీస్సులున్నంత వరకు ఆయనను ఏమీ చేయలేరన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, నంద్యాల, గోస్పాడు ఎంపీపీలు ప్రభాకర్, సైమన్, రాష్ట్ర డైరెక్టర్లు సుబ్బరాయుడు, చంద్రశేఖర్, శశికళారెడ్డి, సునిత అమృతరాజ్, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, పాంషావలి, పురుషోత్తంరెడ్డి, జాకీహుసేన్, దాల్‌మిల్ అమీర్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

మార్చి 10లోగా లైసెన్సులు తీసుకోవాలి

పాములపాడు: డెయిరీలో వెన్న శాతం, ఘన పదార్థాల శాతాలను నిర్ధారించేందుకు వినియోగించే మిల్క్ అనలైజర్స్, ఎలక్ట్రానిక్ మిల్క్ టెస్టర్‌లకు మార్చి 10వ తేదీలోగా లైసెన్సులు తీసుకోవాలని పశువైద్యాధికారి, మిల్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని వెంపెంట గ్రామంలోని పశువైద్యశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పాల సేకరణ, విక్రయాల్లో మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు సరైన పాల ధర వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మిల్క్ ప్రొక్యూర్మెంట్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సేఫ్టీ ఆఫ్ మిల్క్ స్టాండర్డ్స్ యాక్ట్ 2023ను అమలు చేస్తోందన్నారు. ఈ చట్టం ప్రకారం పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్వాహకులంతా తాము వాడుతున్న పరికరాలకు విధిగా లైసెన్సులు పొందాలని చెప్పారు. తమ వివరాలను సమీప పశు వైద్య సిబ్బందికి తెలియజేసి నిర్దేశించిన రుసుము చెల్లించి లైసెన్సులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. లైసెన్స్ పొందకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట నష్టపరిహారం పంపిణీ


రైతుకు చెక్కు అందజేస్తున్న రేంజ్ ఆఫీసర్ ఖాన్

వెలుగోడు: అటవీ జంతువుల కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టం పరిహారాన్ని వెలుగోడు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎంఏ ఖాన్ పంపిణీ చేశారు. గురువారం స్థానిక అటవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నల్లకాల్వ గ్రామానికి చెందిన కాటీపోగు బాలన్న, కాటీపోగు చిన్న బాలస్వామిలకు పంట నష్టపరిహారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోపి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కొండన్న తదితరులు పాల్గొన్నారు.


23 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 23, 24 తేదీల్లో నంద్యాల పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో 52వ రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి, సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు లీగ్–కమ్–నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీలో జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తోందని, ఇందుకు అనుగుణంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25లో 3.7 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈనెల 21న పీఎం కిసాన్ 16వ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదలయ్యే అవకాశం ఉందని, పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలకు ఈ–కేవైసీ చేయించాలని ఆదేశించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం జరిపిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక కాశీ విశ్వేశ్వర, అంజనేయ, లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ నిర్వాహకులు ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని గతేడాది జీర్ణోద్ధరణ పనులు చేపట్టి ప్రతిష్ఠోత్సవం గావించారు. కార్యక్రమాలు పూర్తయి ఏడాది కావడంతో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శాస్త్రోక్తంగా జరిపించారు. అర్చకుడు గోపీశర్మతో పాటు మరి కొందరు వేద పండితులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లను అభిషేకించి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తాదులతో గణపతి,సదర్శన,రుద్రహోమాది పూజాకార్యక్రమాలు చేయించారు. నిర్వాహకులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి,లింగం సత్యం,నూకల కృష్ణమూర్తి,శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల విడుదల

ఉయ్యాలవాడ : 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పంచాయతీల వారీగా..అల్లూరు రూ.4,76,216, బోడెమ్మనూరు రూ.3,10,786, గోవిందపల్లె రూ.1,06,906, హరివరం రూ.5,94,904, ఇంజేడు రూ. 3,30,936, కాకరవాడ రూ. 2,12690, కొండుపల్లె రూ.2,10,016, మాయలూరు రూ.3,40,689, నర్సిపల్లె రూ.2,02,071, పడిగెపాడు రూ.1,10,759, పెద్దయమ్మనూరు రూ.3,32,895, పుచ్చకాయలపల్లె రూ.93,320, ఆర్.జంబులదిన్నె రూ.3,48,380, ఆర్.పాంపల్లె రూ.2,41,986, రూపనగుడి రూ.1,62,224, సర్వాయిపల్లె రూ.2,34,455, సుద్దమల్ల రూ.1,41,297, తుడుమలదిన్నె రూ.2,97,863, ఎస్.కొత్తపల్లె రూ.82,216, ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీకి రూ.8,48,753 విడుదలైనట్లు వెల్లడించారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలు సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేసుకుని రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంచినీటికి అధిక ప్రాధాన్యత కోసం వీటిని వెచ్చించాలని ఈఓపీఆర్‌డీ సూచించారు.

అశ్వవాహనంపై శ్రీహరి విహారం


ప్రత్యేక అలంకరణలో శ్రీహరి

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి మూలమూర్తులు, ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం విశేష అర్చన, లక్ష్మీకుబేర హోమం, సుదర్శన హోమాలు నిర్వహించారు. రాత్రి శ్రీవారిని అశ్వవాహనంపై నగరంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. చతుర్వేద స్వస్తి, భాగవత పురాణం భక్తులను అలరించాయి.


పూజల్లో పాల్గొన్న భక్తులు

సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు


ఖోఖో ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం సీనియర్ ఖో ఖో జట్ల ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారన్నారు. క్రీడల్లో రాణించడం వలన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా డీఎస్‌ఏ కోచ్ భూపతి, వైస్ ప్రెసిడెంట్ పద్మలత, ఫిజికల్ డైరెక్టర్ క్రిష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు డోరాతి, ప్రతాప్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు రథసప్తమి వేడుకలు


రథమండపంపై మహాశివుడి చిత్రం

మహానంది: మహానందిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఈ మేరకు వారు గురువారం మాట్లాడుతూ రథసప్తమి వేడుకల్లో భాగంగా రథమండపం వద్ద సూర్యునికి ప్రీతిగా సూర్యనమస్కారాలు, త్రిచ పూజావిధానంలో అర్ఘ్యము, సూర్య యంత్రారాధనలు చేసి రథానికి ప్రత్యేక నివేదనలు సమర్పిస్తామన్నారు. అనంతరం రథమును బయటకు తీసి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కాగా, రథమండపంపై చిత్రీకరించిన మహాశివుడి చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నలభై అడుగులకు పైగా ఎత్తున్న రథమండపానికి ఉన్న ద్వారంపై మహాశివుడి చిత్రాన్ని వేయించారు. సుమారు రూ. లక్ష వెచ్చించి చిత్రకారులతో వేయించినట్లు ఈఓ కాపు.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి భజన పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట ఎస్సీ కాలనీలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠను పురష్కరించుకొని బుధవారం రాత్రి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి భజన పోటీలు గురువారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 35 భజన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతలుగా కర్నూలుకు చెందిన రామలింగయ్య, తెలంగాణ నుంచి సోమన్న, రాజబాబు, హైదరాబాదుకు చెందిన సత్తెన్న వ్యవహరించారు. అనంతపురం జిల్లా గుర్రంపాడు, అదే జిల్లా పెద్దవడుగూరుకు చెందిన లక్ష్మంపల్లె, మరూరు, కూచివారిపల్లె భజన బృందాలు వరుసగా నాలుగు స్థానంలో నిలిచారు. వీరికి వరుసగా రూ.30వేలు, రూ.25వేలు,రూ.20వేలు,రూ.15వేల నగదు బహుమతులు అందించారు. దాతల సహకారంతో 23 బహుమతులను భజన బృందాలకు మొత్తం రూ.2.03లక్షల నగదు బహుమతులు అందజేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారం అందజేస్తున్న పీడీ నిర్మల

నంద్యాల(అర్బన్): పౌష్టికాహారంతో బాలబాలికలు శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ నిర్మల పేర్కొన్నారు. స్థానిక వరల్డ్ విజన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో పౌష్టికాహార లోపం కలిగిన 40 మంది బాలబాలికలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు ఆఫీసర్ తిరుమలరావు, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఇస్తున్న ఆహారంలో ప్రొటీన్లు తప్పనిసరిగా ఉండాలని, ఐదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడం వల్ల మానసిక ఎదుగుదలకు తోడ్పతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు బాలామృతం ఇవ్వాలని చెప్పారు. సీడీపీఓ చంద్రకళ, సిబ్బంది నాగేశ్వరరావు, రవికుమార్, జెస్సీ, రత్నకుమారి, అరుణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

నంద్యాల(అర్బన్): షార్ట్‌సర్క్యూట్‌తో హోటల్‌లోని వంట సామగ్రి, బట్టలు, డబ్బు కాలి బూడిదై నిరాశ్రయులుగా నిలిచిన అయ్యలూరు మెట్టకు చెందిన మద్దిలేటి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్య వైశ్య సంఘం నాయకులు చల్లా కృష్ణా, వాసవీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్త మద్దిలేటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన తన నివాసం వద్ద మద్దిలేటి కుటుంబానికి రూ.20 వేలు తక్షణ సాయం అందించడమే కాకుండా ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో సంత్ సేవాలాల్ జయంతి


పూజల్లో పాల్గొన్న గిరిజన నాయకులు

వెలుగోడు: పట్టణంలోని జమ్మినగర్ తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జమ్మినగర్ తండాలో భోగ్ బండార్ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. సంత్ సేవాలాల్ శోభా యాత్ర గ్రామ వీధుల గుండా గిరిజన ప్రజల సంసతి సంప్రదాయాలు, నృత్యాలతో శోభాయమానంగా సాగింది. స్థానిక ఆలయంలో గిరిజన పూజారులచే అత్యంత భక్తిశ్రద్ధలతో విశిష్టంగా భోగ్ భండార్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన, భగవత్ తత్వాన్ని పంచిన సంత్ సేవాలాల్ అందరికి మార్గదర్శకుడన్నారు. కార్యక్రమంలో బంజారా ధర్మ రక్ష సమితి రాష్ట్ర నాయకులు నగేష్ నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయక్, బద్దే నాయక్, హోంగార్డు రాము నాయక్, నీలా నాయక్, మంగే నాయ తదితరులు పాల్గొన్నారు.